సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 15 । జులై । 2025



సుదర్శన హోమానికి రూ.లక్ష

సఖినేటిపల్లి: అంతర్వేది నరసన్న ఆలయంలో సుదర్శన హోమానికి డాక్టర్ ఇరగంరెడ్డి రామమనోహర్‌రెడ్డి, నారాయణి దంపతులు (కడప) రూ.లక్ష విరాళం అందజేశారు.



సీట్ రైట్..

ఇంజినీరింగ్ ప్రవేశాల్లో వెబ్ ఆప్షన్ల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థుల నిరీక్షణకు తెర పడింది. జేఎన్‌టీయూకే పరిధిలో సీట్ల ఖరారు పూర్తయ్యింది.

8లో

దుప్పట్లు ఉతికేందుకు టెండర్



స్థానిక వీర వెంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలోని సత్రాల గదులలో ఉపయోగించే దుప్పట్లు, గలేబులు, డోర్ కర్టెన్లు, రగ్గులను ఉతికేందుకుగాను దేవస్థానం అధికారులు సోమవారం టెండర్ పిలిచారు. గత మార్చి నుంచి ఇవి ఉతికేందుకు గాను నామినేషన్ మీద నెలకు రూ.60 వేలు చొప్పున చెల్లిస్తున్నారు.

న్యూస్‌రీల్

కొబ్బరిచెట్లను మింగేస్తున్న గోదావరి



అప్పనపల్లి వద్ద గోదావరిలో కూలిన కొబ్బరి చెట్టు

మామిడికుదురు: ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరుతున్న నీటితో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంతో వైనతేయ తీరంలో కొబ్బరి చెట్లు కూలిపోతున్నాయి. రెండు రోజుల నుంచి వరద ప్రవాహం తీవ్రంగా ఉంది. సుడులు తిరుగుతున్న నీటి ఉధృతికి కొబ్బరి చెట్లు అమాంతంగా నదిలో కూలిపోతున్నాయి. అప్పనపల్లి పాటు రేవు సమీపంలో కొబ్బరి చెట్లతో పాటు సారవంతమైన భూమి నదిలో కలిసిపోయింది. పెదపట్నం, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, పాశర్లపూడి గ్రామాల్లో సైతం పరిస్థితి నెలకొంది.

పీజీఆర్ఎస్‌కు 265 వినతులు



కలెక్టరేట్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాజకుమారి

అమలాపురం రూరల్: అర్జీదారుల సంతృప్తి ధ్యేయంగా పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) బీఎల్ఎన్ రాజకుమారి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారం వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ రాజకుమారి, ఇతర అధికారులు 265 వినతులు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ ఆశ వర్కర్ల పోస్టులకు సంబంధించిన దరఖాస్తులను పీజీఆర్ఎస్‌లో స్వీకరించబడవన్నారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గ్రహించి డీఎంహెచ్‌వో కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కృష్ణమూర్తి, డీఎల్‌డీవో వేణుగోపాలరావు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 35 అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 35 అర్జీలు వచ్చాయి. ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అర్జీదారులు తరలి వచ్చి, తమ సమస్యలపై ఫిర్యాదులు అందించారు. వాటిపై ఎస్పీ చర్చించి, పరిష్కారం కోసం ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. పోలీస్ గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదుల దర్యాప్తులో ఎంత మాత్రం అలక్ష్యం చేయవద్దని అధికారులకు ఆదేశించారు.

మహిళా పోలీసుల బదిలీల్లో అవకతవకలు

అమలాపురం టౌన్: జిల్లాలోని వార్డు, గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న మహిళా పోలీసుల బదిలీల ప్రక్రియలో తప్పులు ఉన్నాయని, వాటిని తక్షణమే సవరించి, బదిలీలు సక్రమంగా సాగేటట్టు చేయాలని జిల్లా మహిళా పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చి ఎస్పీ బి.కృష్ణారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీల మార్గదర్శకాలను అనుసరించకపోవడంతో కొందరు మహిళా పోలీసులు అన్యాయానికి గురవుతున్నారన్నారు. మెడికల్ గ్రౌండ్స్ అభ్యర్థులను పరిగణనలోకి తీసుకోలేదని, పాస్ (భార్యాభర్తలు) విషయాన్ని కూడా పట్టించుకోకుండా పక్కన పెట్టేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే మండలంలో పోస్టింగ్‌లు ఇవ్వకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ, కొన్నిచోట్ల ఆ తరహా బదిలీలు జరిగాయని, ఒకే చోట ఇద్దరికి బదిలీల ఆర్డర్లు ఇచ్చిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయని వాపోయారు. జిల్లాలో 40 మందికి పైగా మహిళా పోలీసులకు బదిలీల మార్గదర్శకాలను పాటించకుండా 40 నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న సచివాలయాలకు బదిలీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏపీ విలేజ్ అండ్ వార్డు సెక్రటేరియట్ మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షురాలు కె.వెంకట ధనలక్ష్మి ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు, బదిలీల బాధితులు జిల్లా ఎస్పీని కలిసి వినతి పత్రం అందజేశారు.

కొబ్బరి రాజసం



కొబ్బరి కాయలను ఒలుస్తున్న కార్మికులు



కురిడీ కొబ్బరి



- పెరుగుతున్న ధర
- ఇప్పటికే కొబ్బరి, కురిడీలకు రికార్డు స్థాయి రేటు
- కురిడీ కొబ్బరి రూ.29,500
- పచ్చి కొబ్బరి రూ.20 వేలు
- శ్రావణ మాసంలో మరింత పెరిగే అవకాశం

సాక్షి, అమలాపురం/ అంబాజీపేట: అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌లో కొబ్బరి ఉత్పత్తుల ధరలు రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తున్నాయి. స్థానికంగా పచ్చి కొబ్బరి, కురిడీ కొబ్బరి, కొత్త కొబ్బరి వంటి ఉత్పత్తులు దొరకడమే గగనంగా మారింది. ఈ నేపథ్యంలో ఈ నెలాఖరు నుంచి శ్రావణమాసం ప్రారంభం కానున్నడంతో మార్కెట్‌లో కొబ్బరి ఉత్పత్తులకు మరింత డిమాండ్ వస్తుందని రైతులు వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

మార్కెట్‌లో జోష్

శ్రావణ మాసానికి ముందే అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌లో జోష్ వచ్చింది. తాజాగా కురుడీ కొబ్బరి ధర రికార్డు స్థాయిలో పెరిగింది. మార్కెట్‌లో సోమవారం పాత కాయలలో గండేరా రకం (పెద్ద కాయలు) వెయ్యి కాయల ధర రూ.29,500 పలికింది. దీనిలోని చిన్న కాయి ధర రూ.28 వేలు. గత శనివారం మార్కెట్‌లో గండేరా రకం ధర రూ.26,500 ఉండగా, గటగాట రకం ధర రూ.25,500 ఉంది. కేవలం రెండు రోజుల వ్యవధిలో రెండు రకాలకు కలిపి రూ. 2,500 నుంచి రూ.మూడు వేల వరకు పెరగడం విశేషం. ఇక కొత్త రకం కాయలలో గండేరా రకం వెయ్యి కాయల ధర రూ.28,500 వరకూ ఉండగా, గటగట రకం రూ.27 వేల వరకూ ఉంది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 1.30 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతోంది. కురిడీ కొబ్బరి వ్యాపారం మొత్తం కోనసీమ కేంద్రంగా సాగుతుండగా, పచ్చి కొబ్బరి, కొత్త కొబ్బరి వ్యాపారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగుతోంది. కురిడీ కొబ్బరితో పాటు పచ్చి కాయ ధరలు సైతం రికార్డు స్థాయిలో ఉన్నాయి. ప్రస్తుత మార్కెట్‌లో పచ్చి కొబ్బరి వెయ్యి కాయల ధర రూ.19 వేల నుంచి రూ.21 వేల వరకూ పలుకుతోంది.

తగ్గిన దిగుబడి

దక్షిణాదిలో కొబ్బరి అధికంగా పండే నాలుగు రాష్ట్రాలలో కొబ్బరి దిగుబడి గణనీయంగా తగ్గింది. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలలో గత ఆరేడు నెలలుగా సగటున వచ్చే దిగుబడిలో 30 శాతం మాత్రమే దిగుబడి వస్తోంది. దీనితో ఉత్తరాది రాష్ట్రాల అవసరాలన్నీ ఏపీ నుంచి వెళ్లే కొబ్బరి తీర్చాల్సి వస్తోంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో కొబ్బరి అధికంగా పడుతున్నా, కోనసీమ జిల్లాలో మాత్రమే కురిడీ కొబ్బరి తయారీ అధికం. ఈ జిల్లాలో సైతం కొబ్బరి కాయను చెట్టు నుంచి దింపిన వెంటనే ఏదో ఒక రూపంలో జాతీయ మార్కెట్‌కు తరలిపోతోంది. దీనితో కురిడీ కొబ్బరి నిల్వలు సైతం అయిపోతున్నాయి. ఈ కారణంగానే ధర అనూహ్యంగా పెరిగింది.

ఆచితూచి అమ్మకాలు

శ్రావణ మాసం మార్కెట్‌పై రైతులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. దక్షణాదిన దిగుబడులు పెరగకపోవడంతో స్థానికంగా వచ్చే కొబ్బరికి మరింత డిమాండ్ వస్తోందని రైతులు అంచనా వేస్తున్నారు. పశ్చిమ కొబ్బరి వెయ్యికాయల ధర రూ.25 వేల వరకూ చేరుతుందని రైతులు నమ్ముతున్నారు. దీనికి తోడు రైతు సంఘాల నాయకులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థల సామాజిక మాధ్యమాలపై ద్వారా ధర మరింత పెరుగుతోందని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. దీనితో రైతులు ఆచితూచి అమ్మకాలు చేస్తున్నారు. కొందరు రైతులు శ్రావణ మాసం వారం రోజులు వస్తోందనగా జరిగే మార్కెట్‌ను బట్టి అమ్మకాలు చేయాలని నిర్ణయించుకున్నారు. దీనితో కోనసీమ జిల్లాలో రైతుల వద్ద పచ్చి కొబ్బరి కొనుగోలు దాదాపు లేదనే చెప్పొచ్చు. ఇది వ్యాపారులకు మింగుడుపడడం లేదు. గతంలో కొబ్బరికాయ రూ.15 ఉంటేనే రైతులు ముందుగానే దింపులు చేసి అమ్మకాలు చేసేవారు. ఇప్పుడు దిగుబడి కొబ్బరి తోటల్లో రాసులుగా ఉన్నా.. కొబ్బరికాయ ధర రూ.21 ఉన్నా కూడా తొందరపడి అమ్మకాలు చేయడం లేదు అని అమలాపురం మండలం కామనగరువుకు చెందిన ఒక వ్యాపారి సాక్షి వద్ద వాపోయాడు.

శ్రావణ సీజన్

ప్రస్తుతం ఆషాడమాసం జరుగుతోంది. అయినా కూడా కొబ్బరి ఉత్పత్తుల ధరలు పెరగడానికి ప్రధాన కారణంగా ఈనెల 25వ తేదీ నుంచి శ్రావణం మొదలు కావడమే. ఇప్పటికే శ్రావణ మాసం కొనుగోలు మొదలైంది. దేశ వ్యాప్తంగా శ్రావణమాసం నుంచి పెద్ద ఎత్తున పూజలు మొదలు కానున్నాయి. పండుగల సీజన్ కూడా ఆరంభం కానుంది. వినాయక చవితి, తరువాత దసరా, దీపావళి వంటి పండుగలు ఉన్నాయి. అలాగే శ్రావణ మాసం సందర్భంగా ఉత్తరాదిలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. మన రాష్ట్రంలో కూడా పూజలు, శుభ కార్యక్రమాలు మొదలు కానున్నాయి. వీటికి కూడా కొబ్బరి పెద్ద ఎత్తున వినియోగిస్తారు. ఈ కారణంగా అటు ఉత్తరాది రాష్ట్రాలోనే కాకుండా స్థానికంగా కూడా కొబ్బరికాయకు డిమాండ్ పెరగనుంది.

ధర పెరిగే అవకాశం



శ్రావణం మాసం వచ్చే కొద్దీ కొబ్బరికి ధర పెరుగుతోందనే అంచనాతో ఉన్నాం. ప్రస్తుతం మార్కెట్‌లో అదే వాతావరణం ఉంది. అందుకే మా రైతులంతా జాగ్రత్తగా అమ్మకాలు చేస్తున్నాం. తమిళనాడులోనే కాదు, మనకు దిగుబడులు తగ్గుతున్నాయి. ధర అధికంగా ఉన్నందున దిగుబడులు తగ్గాయనే ఆందోళన స్థానిక రైతులకు కనిపించడం లేదు.

– ఇళ్ల గోపి, కొబ్బరి రైతు, గంగలకుర్రు అగ్రహారం, అంబాజీపేట మండలం

అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం



కొత్తపేటలో అర్జీదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

- కలెక్టర్ మహేష్ కుమార్
- కొత్తపేటలో అర్జీల స్వీకరణ

కొత్తపేట: అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యను పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. ఆయన అధ్యక్షతన సోమవారం కొత్తపేట ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాలుగు అర్జీలు స్వీకరించారు. బొబ్బర్లంక ఏటిగట్టు ఆక్రమణలను తొలగించాలని, కొత్తపేటలో కౌశిక డ్రైనేజీని శుభ్రం చేయాలని, కొత్తపేట మండలానికి సంబంధించి రెండు భూ సమస్యలపై దరఖాస్తులు అందాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను సంతృప్తి స్థాయిలో మెరుగుపరిచి, ప్రజలకు సుపరిపాలనను చేరువ చేసే దిశగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించాలన్నారు. అధికారులు తమకు అందిన అర్జీపై క్షేత్రస్థాయిలో పూర్తిగా అర్జీదారుని సమక్షంలో విచారణ చేయాలన్నారు. వాటి పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీకర్, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

స్థలాల పరిశీలన

స్థానికంగా రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ), డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) కార్యాలయాల ఏర్పాటు కోసం భూసేకరణ చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ మహేష్ కుమార్ వెల్లడించారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డు వద్ద ఉన్న భూములను ఆయన స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలసి పరిశీలన చేశారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న మేజిస్ట్రేట్ శ్రీరేఖ, ఆర్టీవో శ్రీనివాసరావు, న్యాయవాదులు, పోలీసులు

అమలాపురం టౌన్: మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారమయ్యే కేసులపై కక్షిదారులు, న్యాయవాదులు, పోలీసులు అవగాహన పెంచుకోవాలని అమలాపురం ఫస్ట్ క్లాస్ అడిషనల్ మేజిస్ట్రేట్ కోర్టు మేజిస్ట్రేట్ ఎస్.శ్రీరేఖ అన్నారు. మిడియేషన్ ఫర్ నేషన్ నినాదంతో సోమవారం అమలాపురం పుర వీధుల్లో వన్ కేఎం వాక్ (అవగాహన ర్యాలీ) నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కోర్టుల సముదాయం వద్ద మేజిస్ట్రేట్ శ్రీరేఖ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మధ్యవర్తిత్వ వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం వన్ కేఎం వాక్, మంగళవారం బైక్ ర్యాలీ, బుధవారం సైకిల్ ర్యాలీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగానే వారోత్సవాల తొలి రోజు అమలాపురం రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పి.గోవర్ధన్‌చే పోస్టర్ల ఆవిష్కరణ జరిగిందన్నారు. జిల్లా రవాణాధికారి (ఆర్‌టీవో) దేవిశెట్టి శ్రీనివాసరావు, పట్టణ సీఐ పి.వీరబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి అజయ్ కుమార్ తదితరులు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ర్యాలీలో న్యాయవాదులు, పోలీసులు, ప్యానల్ లాయర్లు, లోక్ అదాలత్ మెంబర్లు, పారా లీగల్ వలంటీర్లు, మిరియాం విద్యా సంస్థల విద్యార్థులు, బార్ అసోసియేషన్ కోశాధికారి నందెపు శ్రీవెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో అనేక లాభాలు

- రైతులకు అవగాహన కల్పించాలి
- వ్యవసాయశాఖ అధికారులతో కలెక్టర్ మహేష్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: రైతులు సేంద్రియ వ్యవసాయం చేపట్టేలా వ్యవసాయ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎరువుల లభ్యత, ప్రకృతి సేంద్రియ వ్యవసాయ విధానాల ఆచరణ, ఖరీఫ్ సాగు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానికంగా లభించే ముడి వనరులను వినియోగించడం ద్వారా హానికరమైన రసాయన ఎరువుల వాడకం తగ్గుతుందన్నారు. తద్వారా భూసారం మెరుగవుతుందని, భూములు చౌడు బారకుండా నేల ఆరోగ్యం బాగుంటుందన్నారు. రసాయనాలు లేకుండా తెగుళ్లు, కలుపు మొక్కలను నియంత్రించ డానికి ప్రకృతి సేంద్రియ పద్ధతులు ఉపయోగపడతాయన్నారు. జీవామృతం, పంచగవ్య వర్మీ కంపోస్ట్ వాడకాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. డ్రోన్ సాంకేతికత ఆధారిత వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన పెంచితే, వ్యవసాయ ఖర్చులు చాలా వరకూ తగ్గిపోతాయన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత లేకుండా సరఫరా చేయాలని, వాటిని వ్యాపారులు అధిక ధరలకు విక్రయించకుండా నియంత్రణా చర్యలు బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు, జిల్లా మార్కెటింగ్ అధికారి కె.విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

1,004 యూనిట్లకు కనెక్షన్లు

ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంలో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకూ 1,004 యూనిట్లకు కనెక్షన్లు ఇచ్చారని, ఆగస్టు 15 నాటికి మరిన్ని కనెక్షన్లు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ మహేష్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోలార్ రూఫ్‌టాప్ ఏజెన్సీలతో ఆయన సమీక్షించారు. ఈ పథకంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని, 300 యూనిట్ల పరిమితి వాడకానికి మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఉత్పత్తికి పరిమితి లేదని పేర్కొన్నారు. సమావేశంలో బ్యాంకు ఎల్‌డీ ఎం.వర్మ తదితరులు పాల్గొన్నారు.

క్వాంటం టెక్నాలజీ ఎఫ్‌డీపీ ప్రారంభం



మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లోని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో క్వాంటం టెక్నాలజీపై ఏఐసీటీఈ – ఏటీఏఎల్ స్పాన్సర్డ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డీపీ) సోమవారం ప్రారంభమైంది. క్వాంటం టెక్నాలజీల రంగాన్ని అన్వేషించడమే లక్ష్యంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) ల ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమని వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ అన్నారు. సమకాలీన విద్య, పారిశ్రామిక దృశ్యంలో క్వాంటం టెక్నాలజీల ఔచిత్యాన్ని వివరించారు. ఎఫ్‌డీపీ కన్వీనర్ డాక్టర్ వి.పెర్సిస్ మాట్లాడుతూ 50 మంది వరకు ఫ్యాకల్టీ సభ్యులు హాజరైన ఈ కార్యక్రమం ఈ నెల 19 వరకు జరుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, కో కన్వీనర్ డాక్టర్ జి. కీర్తి మరిట, సీఎస్ఈ హెచ్‌ఓడీ డాక్టర్ బి.కెజియారాణి పాల్గొన్నారు.

పప్పుతిప్పలు



జీడిపప్పును ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

- జీడిపప్పు పరిశ్రమకు ఆషాఢం ఎఫెక్ట్
- రెండు వారాలుగా మూతబడిన వైనం
- మార్కెట్లో తగ్గిన డిమాండ్
- గింజల బస్తా ధర రూ.12,500
- పప్పు ధర కిలో రూ.700
- గిట్టుబాటు కాదంటున్న రైతులు
- మెట్ట ప్రాంతంలో 90 పరిశ్రమలు

దేవరపల్లి: జీడిపప్పు పరిశ్రమపై మూఢం, ఆషాఢం ఎఫెక్ట్ పడింది. ఆషాఢ మాసానికి ముందు నెల రోజులు మూఢం రావడంతో ముహూర్తాలు లేక జీడిపప్పునకు మార్కెట్లో డిమాండ్ తగ్గిందని వ్యాపారులు వాపోతున్నారు. మార్కెట్లో వినియోగం తగ్గడంతో పప్పు ధర తగ్గింది. మూఢానికి ముందు కిలో పప్పు ధర రూ.800 ఉండగా, ఆషాఢం ప్రారంభం నుంచి తగ్గుముఖం పట్టి ప్రస్తుతం రూ.700 నుంచి రూ.720 పలుకుతోంది. గింజల ధర బస్తా(80 కిలోలు) రూ.12,000 నుంచి 12,500 ఉండడంతో వ్యాపారులకు నష్టం వస్తోంది. బస్తా గింజలకు 24 నుంచి 25 కిలోల పప్పు తయారవుతుంది. కిలో పప్పు తయారు కావడానికి గింజల ధర రూ.690, ఖర్చులు రూ.20 అవుతాయి. అంటే కిలో పప్పు తయారు కావడానికి రూ.710 ఖర్చు అవుతుండగా, ఆదాయం రూ.700 వస్తోంది. దీనిని బట్టి కిలోకు రూ.10 నుంచి రూ.20 నష్టం వస్తోంది.

మెట్ట ప్రాంతంలో విస్తరణ

తూర్పు గోదావరి జిల్లాలోని కొవ్వూరు డివిజన్ పరిధిలోని నిడదవోలు మండలం తాడిమళ్ల, చాగల్లు మండలం చిక్కాల, దేవరపల్లి మండలం దేవరపల్లి, నల్లజర్ల మండలం దూబచర్ల, గోపాలపురం మండలం గోపాలపురంలో జీడిపప్పు పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. తాడిమళ్ల, దేవరపల్లి కేంద్రంగా జీడిపప్పు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి జరుగుతుంది. తాడిమళ్లలో సుమారు 45 పరిశ్రమలు, దేవరపల్లిలో 15 పరిశ్రమలు, చిక్కాలలో 5 పరిశ్రమలు, దూబచర్లలో 15 పరిశ్రమలు , గోపాలపురంలో 10 పరిశ్రమలు ఉన్నాయి. ఎక్కువ ఉత్పత్తి తాడిమళ్ల, దేవరపలి, దూబచర్ల నుంచి జరుగుతుంది. విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన అధునాతన యంత్రాలను తీసుకు వచ్చి వ్యాపారులు జీడిపప్పు తయారీ పరిశ్రమలను నెలకొల్పారు.



దేవరపల్లి పరిశ్రమలో పేరుకుపోయిన జీడిపప్ప నిల్వలు



దేవరపల్లిలో మూతబడిన జీడిపప్ప పరిశ్రమ

కార్మికుల ఉపాధికి గండి

మార్కెట్లో జీడిపప్పునకు డిమాండ్ లేకపోవడం, గింజల ధర పెరగడంతో జీడిపప్పు కొనేనాథుడు కరువయ్యాడని వ్యాపారులు వాపోతున్నారు. తయారు చేసిన పప్పు నిల్వలు మిల్లుల వద్ద పేరుకుపోవడంతో అమ్మకాలు లేక రెండు వారాల నుంచి దేవరపల్లిలోని పరిశ్రమలకు యజమానులు సెలవు ప్రకటించి మూసివేశారు. మండలంలోని 15 పరిశ్రమలు మూతబడడంతో పప్పు తయారీ నిలిచిపోయింది.

శ్రావణమాసంపైనే ఆశలు

ఆషాఢం అనంతరం ఈ నెల 27 నుంచి వివాహాలు, గృహప్రవేశాలు వంటి శుభముహూర్తాలు ఉండడంతో పప్పునకు డిమాండ్ పెరగవచ్చునని వ్యాపారులు ఆశిస్తున్నారు. ఏటా ఆషాఢంలో పప్పు ధర తగ్గగా, శ్రావణంలో ధర పెరుగుతుంది.


గిట్టుబాటు కావడంలేదు



రెండు నెలలుగా మార్కెట్లో పప్పునకు డిమాండ్ తగ్గింది. ఎగుమతులు నిలిచిపోయాయి. ప్రస్తుత ధర గిట్టుబాటుగా లేదు. మూఢానికి ముందు కిలో పప్పు రూ.800 పలకడంతో వ్యాపారం బాగుంది.

– సుతాపల్లి వెంకన్నబాబు, అధ్యక్షుడు, శ్రీవేంకటేశ్వర, క్యాజూ మర్చంట్స్ అసోసియేషన్, దేవరపల్లి

నాణ్యత తగ్గింది



వర్షాలకు తడవడంతో జీడిగింజలు నల్లబడి పప్పు నాణ్యత తగ్గింది. విదేశాల నుంచి దిగుమతి అవుతున్న గింజల పప్పు నాణ్యత బాగుంది. విదేశీ గింజలు బస్తాకు 21 కిలోలు పప్పు దిగుబడి వస్తుండగా, స్వదేశీ గింజలు దిగుబడి 24 నుంచి 25 కిలోలు వస్తోంది. గింజల ధర ఒకే విధంగా ఉన్నాయి. మెట్ట ప్రాంతంలో సుమారు 90 పరిశ్రమలు ఉండగా, దాదాపు 500 మంది వ్యాపారులు ఉన్నారు. మూతబడిన పరిశ్రమలను తెరచి కార్మికులకు ఉపాధి కల్పించాలనే ఆలోచన చేస్తున్నాం.

– పెంజర్ల గణేష్‌కుమార్, జీడిపప్పు వ్యాపారి, దేవరపల్లి

క్లుప్తంగా

జనసేన నాయకుడి ఇసుక దందా

- అక్రమంగా 700 టన్నుల నిల్వ
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



మల్లేశ్వరంలో అక్రమ ఇసుక గుట్టను సీజ్ చేసిన అధికారులు

పెరవలి: కూటమి నాయకుల ఇసుక దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. తాజాగా జనసేన గ్రామ అధ్యక్షుడు అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను అధికారులు సీజ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. పెరవలి మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన జనసేన గ్రామ అధ్యక్షుడు మేడిచెర్ల భాస్కర శివ కుమార్ అదే గ్రామంలో అక్రమంగా 700 టన్నుల ఇసుకను నిల్వ చేశాడు. దీంతో గ్రామస్తులందరూ సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు మైనింగ్ అధికారులు దాడి చేసి ఆ ఇసుక గుట్టను స్వాధీనం చేసుకున్నారు. శివకుమార్‌పై కేసు నమోదు చేయాలో లేక జరిమానా విధించాలో కలెక్టర్ ఆదేశాల మేరకు చేస్తామని జిల్లా మైనింగ్ అధికారి ఫణిభూషణ్ రెడ్డి తెలిపారు. అక్రమ ఇసుక నిల్వలపై తమకు ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు. దాడిలో జిల్లా మైనింగ్ అధికారి శైలజ, పోలీసులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



అన్నంనీడి మహాలక్ష్మి (ఫైల్)

మామిడికుదురు: గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు అన్నంనీడి మహాలక్ష్మి (101) సోమవారం మృతి చెందారు. ఆమె 1924 ఫిబ్రవరి 15వ తేదీన జన్మించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. తొమ్మిది మంది మనవలు, మనవరాళ్లు, 16 మంది ముని మనవలు ఉన్నారు. ఆమె మరణించే వరకు తన పనులు తానే చేసుకునే వారని కుటుంబ సభ్యులు తెలిపారు. 25 ఏళ్ల నుంచి ఒంటి పూట భోజనం చేస్తున్నారన్నారు. గ్రామంలోని శ్మశాన వాటికలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు.

17న జాబ్‌మేళా

కొత్తపేట: స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 17న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ) అండ్ ప్లేస్‌మెంట్ సెల్, వికాస సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఎస్‌బీ మోటార్స్, కేపీపీ పేపర్స్, అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్, ఎల్ఐసీ, డెక్కన్ ఫైన్ కెమికల్స్, ఐజాన్ ఎక్స్పీరియన్సెస్, ఫాక్స్‌కాన్, హుండాయ్ మోబిస్, ఎస్ఎస్ఆర్ ఎల్‌టీఎల్ ట్రైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్, ముత్తూట్ ఫైనాన్స్, శివానిక్, ఇసుజు మోటార్స్ తదితర సంస్థలు ఈ మేళాకు హాజరై తమ ఆయా కంపెనీల్లో సుమారు 820 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమా, బీటెక్, పీజీ చదివిన వారందరూ తమ సర్టిఫికెట్లతో జాబ్‌మేళాకు హాజరుకావచ్చు. మరిన్ని వివరాలకు 81798 24845, 97043 02775, 98497 11253 నంబర్లను సంప్రదించాలి.

సీట్ రైట్..

- జేఎన్‌టీయూకే పరిధిలో సీట్లు ఖరారు
- ఇంజినీరింగ్‌లో 62 వేల సీట్లకు అనుమతి
- 2025-26లో 106 కళాశాలలకు గుర్తింపు
- ఉన్నత విద్యామండలికి నివేదిక



కాకినాడలోని జేఎన్‌టీయూ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్ ప్రవేశాలల్లో వెబ్ ఆప్షన్ల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. జేఎన్‌టీయూకే పరిధిలో సీట్ల ఖరారు పూర్తయ్యింది. తొలుత ఈ నెల 11వ తేదీని ప్రకటించగా, సీట్లు కొలిక్కి రాకపోవడంతో 13వ తేదీకి మార్చారు. రాష్ట్రంలోని వర్సిటీల నుంచి సీట్ల సంఖ్య నివేదికను ఉన్నత విద్యామండలికి అందిస్తేనే.. అక్కడి నుంచి కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ వస్తుంది. రాష్ట్రంలో అత్యధిక కళాశాలలకు అనుబంధంతో పాటు సాంకేతిక వర్సిటీలో కీలకంగా ఉన్న జేఎన్‌టీయూకే ఈ ప్రక్రియను పూర్తి చేసింది. వర్సిటీకి గతంలో పాత ఉమ్మడి జిల్లాలు 8 ఉండగా ఈ ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలు తూర్పు, పశ్చిమ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల కళాశాలలు అనుబంధంగా ఉన్నాయి.

బీటెక్‌లో 62 వేల సీట్ల భర్తీకి అనుమతి

2024–25 విద్యాసంవత్సరానికి కాకినాడ వర్సిటీ పరిధిలో అనుబంధంగా ఉన్న 106 కళాశాలల్లో 62 వేల ఇంజినీరింగ్ సీట్లు భర్తీ చేసుకోవడానికి అనుమతి ఇచ్చారు. వీటితో పాటు ఈ ఏడాది కొత్తగా కృష్ణా జిల్లా ఏఎస్ఆర్, ప్రకాశం జిల్లాలో శ్రీహర్షిత కళాశాలకు గుర్తింపు లభించింది. బీటెక్ విభాగంలో గత ఏడాది దాదాపు 30 కళాశాలల వరకూ డిమాండ్ ఉన్న కంప్యూటర్ సైన్స్ కోర్సు కోసం 4 వేల సీట్లకు అనుబంధ కళాశాలలు దరఖాస్తు చేసుకోగా అక్కడి సౌకర్యాలు బట్టి వాటికి అనుమతి ఇచ్చారు. కొత్త కోర్సులైన ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో వీఎల్ఎస్ఐ డిజైన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ కోర్సులకు వెయ్యి సీట్లకు పైగా అనుమతి లభించింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ మెయిన్స్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా ఐఐటీ, ఎన్ఐటీలలో సీటు సాధించలేకపోయిన విద్యార్థులు ఏపీ ఈఏపీ సెట్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. వీరు ప్రైవేట్ వర్సిటీలతో పాటు ఏ గ్రేడ్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ బ్రాంచ్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు.

వసతులున్న కాలేజీలకే గుర్తింపు



రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలు ఆన్‌లైన్ ద్వారా కళాశాలల ప్రమాణాలు పరిశీలన చేసి అనుమతి ఇవ్వాలని ఉన్నత విద్యామండలి సూచించింది. ఆ మేరకు జేఎన్‌టీయూ కాకినాడ ఆన్‌లైన్‌లో తనిఖీలు నిర్వహించింది. సాంకేతిక విద్యలో ఉన్నత ప్రమాణాలు పాటించడంతో పాటు అన్ని వసతులు ఉన్న వాటికే గుర్తింపు ఇచ్చాం. అటువంటి కళాశాలలో అభ్యసిస్తే విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు దక్కుతాయి.

– డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్, జేఎన్‌టీయూకే

ఆన్‌లైన్‌లో కళాశాలల తనిఖీ

రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు అనుబంధ కళాశాలల తనిఖీలను ఆన్‌లైన్‌లో చేపట్టారు. మౌలిక సదుపాయాల పర్యవేక్షణ, కళాశాల స్థితిగతులు, వసతులు, విద్యార్థి అధ్యాపక నిష్పత్తి, క్యాంపస్ కళాశాల పరిస్థితి, క్రీడా మైదానం, గ్రంథాలయ సదుపాయం, ల్యాబ్ తదితర అంశాలను పరిశీలన చేస్తారు. ఏటా ఇంజినీరింగ్ కళాశాలలకు అనుబంధ గుర్తింపు ఇచ్చే ముందు నిజనిర్ధారణ కమిటీ ఈ పర్యవేక్షణ చేయిస్తుంది. కమిటీ సిఫారసు మేరకు ఏయే కళాశాలలకు ఎన్ని సీట్లు కేటాయించాలి అనే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటారు. మరో వైపు ఏఐసీటీఈ నుంచి అనుమతి తెచ్చుకున్న ఇంజినీరింగ్ సీట్లలో ఎన్ని సీట్లకు యూనివర్సిటీ అనుబంధ గుర్తింపు ఇస్తుందనే అంశానికి నిజనిర్ధారణ కమిటీ సిఫారసులే కీలకం. ఈ కమిటీలో వర్సిటీ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సభ్యులుగా ఉంటారు.

రూ.లక్ష విరాళం అందజేత



జేసీ రాహుల్ మీనాకు చెక్కు అందజేస్తున్న ఎన్‌జీవో అసోసియేషన్ ప్రతినిధులు

కాకినాడ సిటీ/కాకినాడ క్రైం: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో ఆగస్టులో జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, మహిళల హాకీ టోర్నమెంట్ల నిర్వహణకు ఏపీఎన్‌జీవో జిల్లా శాఖ రూ.లక్ష విరాళమిచ్చి ఆదర్శంగా నిలిచింది. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ గత వారంలో వివిధ ఉద్యోగ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ర్యాలీ, క్రీడల ఘన నిర్వహణకు సంఘాల తరఫున చేయూతనందించాలని కోరారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల్లో జిల్లా ఏపీఎన్‌జీవో శాఖ రూ.లక్ష మొత్తాన్ని సమకూర్చింది. ఈ మొత్తాన్ని చెక్ రూపంలో సోమవారం ఆ సంఘ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుద్దటి రామ్మోహన్, పేపకాయ వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్ చేతుల మీదుగా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు అందించారు. ఈ మేరకు సంఘ నేతలను జేసీ అభినందించారు. జేసీని కలసిన వారిలో సంఘ జిల్లా సహ అధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తి బాబు, సరెళ్ల చంద్రరావు, సంయుక్త కార్యదర్శి శశికుమార్ ఉన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి



సీపీఎం ప్రచార పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

పెద్దాపురం: స్మార్ట్ మీటర్లను, విద్యుత్ సర్దుబాటు చార్జీల పెంపుదలను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు అన్నారు. దీనిలో భాగంగా పార్టీ ఆధ్వర్యంలో జరిగే ప్రచార కార్యక్రమ పోస్టర్‌ను సోమవారం పెద్దాపురంలోని యాసలపు సూర్యారావు భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ అండతో ప్రతిరోజు, ప్రతి గంట, ప్రతి ఇంటినీ దోచుకునేలా అదానీ ఏర్పాటు చేసుకున్నారన్నారు. మన అనుమతి లేకుండా బెదిరించి మరీ, స్మార్ట్ మీటర్ మార్చడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిని అడ్డుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇప్పటి వరకూ కరెంటు బిల్లు వచ్చిన 15 రోజులు, నెల రోజుల లోపు సొమ్ములు కట్టేవారమని, ఇక నుంచి బిల్లు ముందుగానే చెల్లించాల్సి వస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు వేస్తే బద్దలు కొట్టండి అని చెప్పిన లోకేష్.. ఇప్పుడు ఎక్కడకు పోయారని ప్రశ్నించారు. బీజేపీ అండతో తెలుగుదేశం, జనసేన.. ప్రజల మీద కరెంటు చార్జీలు, స్మార్ట్ మీటర్ల రూపంలో దాడి చేస్తున్నాయన్నారు. ప్రతి ప్రాంతంలోనూ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రొంగల వీర్రాజు, సుబ్బలక్ష్మి, దారపురెడ్డి కృష్ణ, నెక్కల నరసింహమూర్తి, కూనిరెడ్డి అప్పన్న పాల్గొన్నారు.

దుప్పట్లు ఉతికేందుకు టెండర్

- విడుదల చేసిన అన్నవరం దేవస్థానం
- 'సాక్షి' కథనానికి స్పందన
- ప్రస్తుతం నామినేషన్ విధానంలో నెలకు రూ.60 వేల చెల్లింపు

సాక్షి ఇంపాక్ట్



గత నెల 24 న సాక్షి దినపత్రికలో సత్యదేవునికే టెండర్ శీర్షికన ప్రచురితమైన వార్త

అన్నవరం: స్థానిక వీర వెంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలోని సత్రాల గదులలో ఉపయోగించే దుప్పట్లు, గలేబులు, డోర్ కర్టెన్లు, రగ్గులను ఉతికేందుకుగాను దేవస్థానం అధికారులు సోమవారం టెండర్ పిలిచారు. గత మార్చి నుంచి ఇవి ఉతికేందుకు గాను నామినేషన్ మీద నెలకు రూ.60 వేలు చొప్పున చెల్లిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో అధికారులు ఈ నామినేషన్ మీద కేటాయించారన్న విమర్శ కూడా ఉంది. టెండర్లు పిలిస్తే ఇంకా తక్కువకు వీటిని ఉతుకుతారనే అభిప్రాయం నెలకొంది. గత నెల 23న స్థానిక రజకవృత్తిదారుడు కింతాడ శ్రీనివాసరావు తాము నెలకు రూ.45 వేలకే వాటిని ఉతుకుతామని దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో 'సాక్షి' దినపత్రికలో 'సత్యదేవునికే టెండర్' శీర్షికన వార్త ప్రచురితమైంది.

21 వరకూ దరఖాస్తులకు గడువు

దేవస్థానంలో రెండేళ్లపాటు పారిశుధ్య కాంట్రాక్టు నిర్వహించిన కేఎల్‌టీఎస్ సంస్థ గత ఫిబ్రవరి నెలాఖరు వరకూ సత్రం గదులలో మంచాలపై వేసిన దుప్పట్లు, గలేబులు, డోర్ కర్టెన్లను ఉతికించే పని కూడా నిర్వహించేది. అప్పుడు వాషింగ్ మెషీన్ల ద్వారా శుభ్రం చేసేవారు. ఆ సంస్థ కాంట్రాక్టు పూర్తి కావడంతో గత మార్చి నుంచి నెలకు రూ.60 వేలు చొప్పున చెల్లిస్తూ శుభ్రం చేయిస్తున్నారు. గత నాలుగు నెలలుగా ఈ విధానం కొనసాగుతోంది. పైగా వాటిని ఉతికేందుకు మెటీరియల్‌ను దేవస్థానమే అందజేస్తోంది. ప్రస్తుతం మనుషులు ఉతుకుతుండడంతో అంతగా శుభ్రంగా ఉండడం లేదని, వాసన వస్తున్నాయన్న ఫిర్యాదులు భక్తుల నుంచి వస్తున్నాయి. దీంతో వాషింగ్ మెషీన్లు టెండరు దారుడే సమకూర్చుకుని ఉతికి ఇచ్చేందుకు టెండర్ పిలిచారు. ఈ నెల 21వ తేదీ లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

బంగారం, నగదు చోరీ



చోరీ జరిగిన గదిలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

తుని: పట్టణంలోని తామాకులవారి వీధిలో గల ఇంటిలో బంగారం, నగదును చోరీ చేశారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనపై బాధితుడు నక్కా లోకేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లోకేష్, కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం పెద్దాపురం మరిడమ్మ తల్లిని దర్శించుకుని రాత్రి 11 గంటలకు ఇంటికి వచ్చారు. కింది పోర్షన్‌లోకి వెళ్లి మంచినీరు తాగి తాళాలు వేశారు. అనంతరం మేడపైకి వెళ్లి అందరూ నిద్రపోయారు. సోమవారం ఉదయం 6 గంటలకు నిద్ర లేచి కిందికి రాగా తలుపులు తెరచి, తాళాలు పగలుకొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి గమనించగా, బీరువాలోని 100 గ్రాముల బంగారం, రూ.4 వేలు మాయమయ్యాయి. దీంతో బాధితుడు తుని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ విజయ్ బాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కాకినాడ నుంచి క్లూస్ టీం చోరీ జరిగిన గదిని పరిశీలించి, వేలిముద్రలను సేకరించింది.

నలుగురు దొంగల అరెస్టు

కాకినాడ క్రైం: దురలవాట్లకు బానిసలై, దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురిని ఇంద్రపాలెం పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడలోని డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంతో ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్ ఈ వివరాలు వెల్లడించారు. కాకినాడకు చెందిన గంపల సతీష్, యానానికి చెందిన మల్లాడి దుర్గాప్రసాద్, కాలాడి అర్జునరావు, బిక్కవోలుకు చెందిన గొర్రిపూడి వెంకటరమణ ముఠాగా ఏర్పడి ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు వీరిని అరెస్టు చేసి రూ.16 లక్షల విలువైన 119 గ్రాముల బంగారం, 1,567 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మరో నేరంలో రేఖాడి వెంకటేశ్వర్లును అరెస్టు చేసి రూ.1.6 లక్షల విలువైన 16 గ్రాముల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. వీరిపై ఇంద్రపాలెం, పోర్టు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

పురుగు మందు తాగి లారీ డ్రైవర్ ఆత్మహత్య

తాళ్లరేవు: కోటనందూరు మండలం బిళ్లనందూరు గ్రామానికి చెందిన పెదరెడ్ల రామారావు(40) అనే లారీ డ్రైవర్ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రామారావు డ్యూటీపై ఈ నెల 7వ తేదీన ఇంటి నుంచి బయలుదేరాడు. 8వ తేదీన పెట్రోల్ ట్యాంకర్‌పై యానాం నుంచి కాకినాడ వెళుతుండగా మార్గం మధ్యలో పటవల సెంటర్‌లో మోటార్ సైకిల్‌పై వెళుతున్న భార్యాభర్తలను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఈ విషయాన్ని తన భార్య వెంకటలక్ష్మికి చెప్పి రామారావు బాధపడ్డాడు. అదే రోజు సాయంత్రం 4 గంటల సమయంలో తన భార్య సెల్‌ఫోన్‌కు తాను పురుగు మందు తాగి చనిపోతాను అని మెసేజ్ పెట్టాడు. అప్పటి నుంచి అదృశ్యమయ్యాడు. ఇలా ఉండగా.. సుంకరపాలెం గ్రామంలోని సుజి టైల్స్ పక్కన గల ఏసురాజు సైట్‌లోని వీర్రాజు కొబ్బరిపాకలో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానిక వీఆర్వో సమాచారం మేరకు కుటుంబ సభ్యులు అక్కడకు వచ్చి, అది రామారావు మృతదేహమని గుర్తించారు. రోడ్డు ప్రమాదంలో మహిళ చనిపోవడంతో భయపడి, జీవితంపై విరక్తితో ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటాడని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

కోరంగి పంచాయతీ చిన్నబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన సంగాడి సూరిబాబు అనే మత్స్యకారుడు వేటకు వెళ్లి మృతి చెందినట్లు కోరంగి ఎస్సై సత్యనారాయణ తెలిపారు. సూరిబాబు మరో ఐదుగురితో కలిసి ఫైబర్ బోటులో ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకు బయలుదేరి సముద్రంలో వేటకు వెళ్లారు. సూరిబాబు ప్రమాదవశాత్తూ సముద్రంలో పడిపోగా మిగిలినవారు గాలించి బోటులోకి తీసుకువచ్చారు. అయితే అప్పటికే సూరిబాబు మృతి చెందాడని, మృతదేహాన్ని కాకినాడ జీజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నకిలీ ష్యూరిటీ కేసులో ఇద్దరికి జైలు

రాజమహేంద్రవరం రూరల్: నకిలీ ష్యూరిటీలతో రాజమండ్రి ఏడవ అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు నుంచి లారీ విడుదలకు ప్రయత్నం చేసిన ఇద్దరికి రెండున్నరేళ్ల జైలు, రూ.20 వేల జరిమానా విధిస్తూ మూడో అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి సి.రమ్య తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. విశాఖలోని గాజువాకకు చెందిన నాగవల్లి రామకృష్ణ 2018 అక్టోబరు 3న ఏడో అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో బొమ్మూరు పోలీస్‌స్టేషన్ కేసులో ప్రాపర్టీగా ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను రిలీజ్ చేయించేందుకు అర్జీ పెట్టుకున్నాడు. ష్యూరిటీ కోసం కంబాలపేటకు చెందిన బట్టుకుమార్‌ను సంప్రదించాడు. దీంతో బట్టు కుమార్ ష్యూరిటీలపై ఆఫీసర్ సిగ్నేచర్‌ను ఫోర్జరీ చేసి కోర్టులో ఫైల్ చేశారు. వాటిని పరిశీలించిన కోర్టు, విచారణకు పంపించగా, ఫోర్జరీ అని తేలింది. దీంతో త్రీటౌన్ ఎస్సై భానుప్రసాద్ కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసును విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

కోడి పందేలపై దాడి

గోపాలపురం: మండలంలోని దొండపూడి, వెంకటాయపాలెం గ్రామాల్లో కోడి పందేలు జరుగుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్సై పి.మనోహర్ సోమవారం తెలిపారు. దొండపూడి గ్రామ శివార్లలో 12 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.8,020, రెండు కోడి పుంజులు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వెంకటాయపాలెంలో 8 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3,800, రెండు కోడి పుంజులు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నామన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	29,500
గటగట (వెయ్యి)	27,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	28,000
గటగట (వెయ్యి)	25,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

బాస్కెట్ బాల్ రన్నర్‌గా ఏపీఎస్పీ



రన్నర్‌గా నిలిచిన కాకినాడ ఏపీఎస్పీ జట్టు సభ్యులు

కాకినాడ రూరల్: రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కాలేజీలో ఈ నెల 13న జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జూనియర్ బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్ – 2025 రన్నర్‌గా కాకినాడ ఏపీఎస్పీ జట్టు నిలిచింది. ఈ విషయాన్ని ఏపీఎస్పీ బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాజు తెలిపారు. రామచంద్రపురం జట్టుతో ఫైనల్ మ్యాచ్‌లో హోరాహోరీగా తలపడిందన్నారు. పోటీలో పాల్గొని ప్రతిభ చూపిన క్రీడాకారులను ఆయన సోమవారం అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మహేష్, శంకర్, రాజేష్, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

తిరుమల విద్యార్థులకు అభినందన



రామ్‌కిరీటిని అభినందిస్తున్న మంత్రి లోకేష్, చిత్రంలో నున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: నీట్ 2025 ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 19వ ర్యాంకు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన రాజమహేంద్రవరం తిరుమల కళాశాల విద్యార్థి డి.కార్తిక్ రామ్‌కిరీటిని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అభినందించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్-2025లో ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో ఆలిండియా 8వ ర్యాంకు సాధించిన కె.యశ్వంత్ సాత్విక్, ఎస్సీ కేటగిరీలో ఆలిండియా రెండవ ర్యాంకు సాధించిన కె.ప్రణీత్‌లకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ ఘనతను సాధించిన తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావును మంత్రి లోకేష్ అభినందించారు. స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో కలసి ఆయా విద్యార్థులు సోమవారం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ చిన్న విషయాలకే నేటితరం విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని, లైఫ్ అంటే చాలెంజ్ అన్నారు. దాన్ని స్వీకరించాలే తప్ప అధైర్యపడకూడదన్నారు. ఆ విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. కలల సాధనకు నిరంతరం శ్రమించాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కాజేసి.. తండ్రిని గెంటేసి..

- రాజమహేంద్రవరంలో కుమార్తెల నిర్వాకం
- దొంగ దారిలో నాన్న ఇంటి రిజిస్ట్రేషన్
- బ్యాంకు ఖాతాలోని సొమ్ము స్వాహా
- పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిన వృద్ధుడు



రాములు నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఆర్డీవో కార్యాలయం ఏఓ సుజాత

సీటీఆర్ఐ: సాధారణంగా తండ్రిపై కుమార్తెలకు ప్రేమ చాలా ఎక్కువ ఉంటుందని చెబుతుంటారు. కొడుకులు చూడకుండా వదిలేసిన చాలామంది తండ్రులు తమ కూతుళ్ల దగ్గర ఆశ్రయం పొందుతున్న సంఘటనలు చాలా చూస్తాం. అయితే రాజమహేంద్రవరంలో ఇద్దరు కుమార్తెలు తమ తండ్రినే మోసం చేసి, ఆయన ఇల్లు రాయించుకుని, బ్యాంకు ఖాతాలోని డబ్బులను కూడా కొట్టేశారు. ఆ వృద్ధుడు సోమవారం ఆర్డీవోకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

వివరాలు ఇవీ..

సీతంపేటకు చెందిన యొన్నంశెట్టి రాములుకు ప్రస్తుతం 72 ఏళ్లు. ఆయన 40 ఏళ్లగా సీతంపేటలోని సొంతింట్లో నివసిస్తున్నాడు. కాలేజీ అటెండర్‌గా ఉద్యోగం చేసి విశ్రాంతి జీవనం గడుపుతున్నాడు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలిద్దరికీ వివాహాలు చేసి అత్తవారిళ్లకు పంపేశాడు. కుమారుడు ఉద్యోగ రీత్యా చెన్నైలో ఉంటున్నాడు. అయితే 2020లో రాములు భార్య చనిపోవడంతో తండ్రికి తోడుగా ఉండటానికి వచ్చిన కుమార్తెలు ఇక్కడే తిష్ట వేశారు. తమ అన్నయ్యకు తెలియకుండా తండ్రి డబ్బును, ఆస్తిని కాజేశారు. 2023లో ఇంటిని తమ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించున్నారు. అలాగే తండ్రికి తెలియకుండా ఆయన బ్యాంకు ఖాతాలోని రూ.15 లక్షలను తమ ఖాతాలోకి జమ చేసుకున్నారు. విచిత్రమేమిటంటే.. ఆ ఇంటి దస్తావేజులను బ్యాంకులో తాకట్టు పెట్టి గతంలోనే రుణం తీసుకున్నారు. అయినా ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండానే రాజమహేంద్రవరంలో రిజిస్టర్ చేయడం విశేషం. తండ్రి నుంచి ఆస్తి, డబ్బులు తీసుకున్న అనంతరం ఆయనను కొట్టి, నిర్దాక్షిణ్యంగా ఇంటి నుంచి బయటకు గెంటేశారు. దీంతో కుమారుడు వచ్చి ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. దీనిపై 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ కేసు నమోదు చేసుకున్నారు. ఇంటి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరుతూ ఆర్డీవోకు ఫిర్యాదు చేయాలని తెలపగా, సోమవారం పీజీఆర్ఎస్‌కు వచ్చారు. వృద్ధాప్యం కారణంగా వినపడకపోవడంతో పాటు నడవలేని పరిస్థితిలో ఉన్న రాములు అవస్థ చూసిన ఏఓ సుజాత.. ఆర్డీవో కార్యాలయం బయటికి వచ్చి వివరాలను అడిగి తెలుసుకున్నారు.